క్లుప్తంగా

దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది మానవత్వం



మృతుడి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ద్వారకాతిరుమల: తమతో పాటు కలిసి పనిచేస్తూ, అకాల మరణం చెందిన సెక్యూరిటీ గార్డు కుటుంబానికి సోమవారం ఆర్థిక సాయం అందించి, మానవత్వాన్ని చాటారు శ్రీవారి దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది. కామవరపుకోట గ్రామానికి చెందిన భైరవపాటి శివరామకృష్ణ స్థానిక దేవస్థానంలో సెక్యూరిటీ గార్డుగా పని చేసేవాడు. ఇటీవల అకస్మాత్తుగా మరణించాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో సెక్యూరిటీ సిబ్బంది ఆర్థిక సాయం నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పలువురు సిబ్బంది కామవరపుకోటలోని మృతుడి ఇంటికి వెళ్లి, అతని తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, ముత్యాలమ్మకు రూ.35 వేలను అందించారు.

వేడుకగా శ్రీవారి తిరువీధి సేవ



తొళక్క వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో చిన వెంకన్న తిరువీధి సేవ సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు, గోదాదేవితో కలిసి స్వామి వారు ఉదయం క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని ముందుగా ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన తొళక్క వాహనంపై స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. పూజాధికాలు అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, అశ్వ, గజ సేవల నడుమ శ్రీవారి వాహనం క్షేత్ర పురవీదుల్లో తిరుగాడింది.

పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి

కుక్కునూరు: మండల పరిధిలోని గొమ్ము గూడెం గ్రామంలో సోమవారం గ్రోమోర్ సురక్ష డే సందర్భంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టెరిటరీ మేనేజర్ రాజశేఖర్ పంట ప్రారంభ దశ నుంచి చివర దశ వరకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. అంతేకాక రైతులు పురుగు మందులు పంటలకు పిచికారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో 50 మంది రైతులకు సేఫ్టీ కిట్స్ ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరమండల్ ట్రైనీస్ నిమ్మల ప్రవీణ్, వల్లపూదాసు వంశీ, రైతులు కంపెళ్ల మధు, ముదిగొండ వీరబాబు, గుమ్మల రమేష్, గుమ్మల రామక్రిష్ణ, తుమ్మల సాంబ శివరావు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు: మండలంలోని వేలేరు అటవీ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా సారాను తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన బెల్లపు ఊటను సోమవారం జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపిన వివరాలు ప్రకారం కుక్కునూరు మండలంలోని వేలేరు గ్రామ శివారు అటవీప్రాంతంలో సారా తయారు చేసేందుకు బెల్లపు ఊటను సిద్ధం చేశారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 1350 లీటర్ల బెల్లపు ఊటను, ఏడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెంలో వేంచేసియున్న శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రధాన అర్చకులు తేజ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు మండపారాధన, పుణ్యావచనం, స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చన, తదుపరి లక్ష్మీగణపతి హోమం, నీరాజనం మంత్ర పుష్పాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

కొయ్యలగూడెం: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం పోలవరం రోడ్డులో ధర్నా నిర్వహించారు. పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఏలూరు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ కూనపోము రాజారత్నం, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి భాస్కర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. బుట్టాయగూడెం, కుక్కునూరు మండలాల పార్టీ అధ్యక్షులు టీడీపీ కుటుంబరావు, గజ్జి రాజు, టౌన్ ప్రెసిడెంట్ గుత్తుల సత్యనారాయణ, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బుచ్చిరాజు, బుట్టాయిగూడెం క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఏసు పాదం, సీనియర్ నాయకులు పొన్న రామచంద్రం, పేరుబోయిన లక్ష్మణరావు పాల్గొన్నారు.

పశువులకు శాపం.. ముద్దచర్మ వ్యాధి

- వ్యాక్సినేషన్ చేయించాలని వైద్యుల సూచన
- అలసత్వం వహిస్తే పశువుల ప్రాణాలకే ముప్పు





ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులు

జంగారెడ్డిగూడెం: ముద్దచర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిసీజ్) అనేది ఆవులకు సోకే ఒక వైరస్ వ్యాధి. ఈ వ్యాధి పశువుల పాలిట శాపంగా మారింది. ఈ వ్యాధి వలన పశువుల చర్మంపై ముద్దలు, గడ్డలు ఏర్పడతాయి. ఈ వ్యాధి వలన పశువులు చాలా ఇబ్బందికి గురవుతాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది.

లక్షణాలు

పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడతాయి. అధిక జ్వరంతో బాధపడడం. బలహీనంగా, అలసటగా ఉండడం. ఆహారం తక్కువగా తీసుకోవడం. ముద్దచర్మ వ్యాధి సోకిన పశువులు తక్కువ పాలు ఇవ్వడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

వ్యాధి వ్యాప్తి

ముద్ద చర్మ వ్యాధి వైరస్ పశువుల నుంచి పశువులకు, దోమలు, ఇతర కీటకాలు ద్వారా వ్యాపిస్తుంది. వ్యాధి ఉన్న పశువుల నుంచి ఇతర పశువులకు ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తుంది.

వ్యాక్సినేషన్

గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్ వలన ముద్ద చర్మ వ్యాధి నివారణ సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఈ వ్యాక్సిన్‌ను అందిస్తుంది, పశువులకు వ్యాధి రాకుండా ఉండేందుకు ఈ వ్యాక్సిన్ దోహదపడుతుంది.

నివారణ ఇలా..

- పశువుల నివాస ప్రదేశాలను శుభ్రంగా ఉంచడం వలన వ్యాధి వ్యాప్తిని తగ్గించొచ్చు.
- ముద్దచర్మ వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరుగా ఉంచాలి.
- పశువులకు దోమల నుంచి రక్షణ కల్పించడం ముఖ్యమైంది.
- పశువులకు సమయానికి వ్యాక్సిన్ వేయించాలి.
- ఏదైనా లక్షణాలు గమనిస్తే వెంటనే స్థానిక పశు వైద్యులను సంప్రదించాలి.

ప్రభుత్వ చర్యలు

ముద్దచర్మ వ్యాధి నివారణకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్‌ను అందిస్తూ ఉన్నాయి. పశువుల వ్యాక్సినేషన్ కోసం సొసైటీల ద్వారా ఉచిత సేవలు కల్పించాయి. ఈ సేవలను పశుపోషకులు వినియోగించుకోవాలి.

ముద్దచర్మ వ్యాధి ప్రమాదకరం



ముద్దచర్మ వ్యాధి పశువులకు ప్రమాదకరమైనది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించొచ్చు. ముఖ్యంగా ప్రభుత్వం ద్వారా అందిస్తున్న గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్ వినియోగిస్తే, ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చు. ప్రతి రైతూ పశు వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించి తమ పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్, పశు వైద్యాధికారి

కదిలిన యంత్రాంగం

శ్మశాన వాటికలో లైట్లు, షవర్ల ఏర్పాటుకు చర్యలు

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: స్థానిక శ్మశాన వాటికలో స్ట్రీట్ లైట్లు, స్నానాలకు షవర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్టు ఈఓపీఆర్డీ ఏవీ సుబ్బరాయన్ తెలిపారు. సాక్షి దినపత్రికలో 'దహన సంస్కారాలకు దారేది ?' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనంపై పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. అందులో భాగంగా ఈఓపీఆర్డీ సుబ్బరాయన్, పంచాయతీ కార్యదర్శి జీటీవీ శ్రీనివాస్, విద్యుత్‌శాఖ ఏఈ నరసింహస్వామి శ్మశాన వాటికను సందర్శించారు. స్ట్రీట్ లైట్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి, స్నానాలకు షవర్లను ఏ ప్రాంతంలో ఏర్పాటు చేయాలనే అంశాలను పరిశీలించారు. వీటి నిర్మాణాలకు అవసరమైన అంచనాలను సిద్ధం చేస్తున్నట్టు సుబ్బరాయన్ పేర్కొన్నారు. త్వరితగతిన ఈ పనులను పూర్తి చేస్తామని చెప్పారు.

సంస్కరణలకు ఆద్యుడు పీవీ

కొయ్యలగూడెం: భారతదేశంలో సంస్కరణలకు ఆద్యుడు స్వర్గీయ పీవీ నరసింహారావు అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. సోమవారం గాంధీ సెంటర్‌లో పీవీ నరసింహారావు 20వ వర్ధంతి కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ రాజారత్నం, పోలవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ బండి విజయ భాస్కర్, బుట్టాయగూడెం, కుక్కునూరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిడిపి కుటుంబరావు, గజ్జి రాజు, తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవిగా చిన్నారి 'ఖ్యాతి'



గోదాదేవి అలంకారంలో చిన్నారి ఖ్యాతి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో గోదాదేవి అలంకరణలో ఓ చిన్నారి సోమవారం రాత్రి సందడి చేసింది. గ్రామానికి చెందిన దాస్యం వరప్రసాద్, మయూరి దంపతుల కుమార్తె ఖ్యాతి గోదాదేవిగా అలంకారమైంది. మెడలో పూల దండ, ఒక చేతిలో గులాబీ పువ్వు, మరో చేతిలో రామ చిలుకతో ఆలయంలో సందడి చేసింది. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని చిన్నారి ఖ్యాతిని గోదాదేవిగా అలంకరించినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

కలప అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



రేంజ్ అధికారి శివరామకృష్ణ

బుట్టాయగూడెం: అటవీ భూముల్లో చెట్లను నరికి కలపను అక్రమంగా రవాణా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కన్నాపురం రేంజ్ అధికారి ఎ.శివరామకృష్ణ తీవ్రంగా హెచ్చరించారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ అడవులను సంరక్షించవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కలప అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ముఖ్యంగా పొగాకు బేరన్లకు కలప అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తాను గుర్తించానన్నారు. ఫారెస్టు చట్టాలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. ఇదిలా ఉండగా రేంజర్‌గా బాధ్యతలు చేపట్టిన నాలుగు రోజుల్లోనే కలప అక్రమ రవాణాదారులకు శివరామకృష్ణ చుక్కలు చూపిస్తున్నారు. ఇప్పటికే అక్రమంగా కలప రవాణా చేస్తున్న సుమారు ఆరు వాహనాలు సీజ్ చేశారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి

- ఈ నెల 27న జరిగే పోరుబాటను జయప్రదం చేయండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మాజీ హోం మంత్రి వనిత పిలుపు



పోరుబాట కరపత్రాన్ని చూపుతున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత, రాజబాబు, తదితరులు

ద్వారకాతిరుమల: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత సోమవారం పిలుపునిచ్చారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన పార్టీ మండల నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆమె ముందుగా వైఎస్సార్‌సీపీ పోరుబాట కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వాటిని పార్టీ నేతలకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వనిత మాట్లాడుతూ కరెంటు చార్జీల బాదుడుపై ఈ నెల 27న అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. అందులో భాగంగా ఆ రోజు ఉదయం పది గంటలకు గోపాలపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో అధికారులకు వినతిపత్రం అందిస్తామని, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె కోరారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన ఆరు నెలల లోపే గృహ వినియోగదారులపై రూ.15,485,36 కోట్ల చార్జీల భారాన్ని మోపడం దారుణమన్నారు. వెంటనే వాటిని వెనక్కి ఇవ్వడంతో పాటు, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, దాకారపు బంగారమ్మ, మల్లెపూడి నాగమణి, పోల్కంపల్లి అనీల్‌బాబు, చెలికాని ప్రవీణ్, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, చెలికాని బుల్లియ్య, బొండాడ వెంకన్నబాబు, గోపా నాగేశ్వరరావు, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, పొనమాల ఉమామహేశ్వరరావు, ఆచంట బన్ను, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రం.. సుందర 'స్నో'యగం



కొండపైన జంట గోపురాల ప్రాంతంలో హిమవర్షంలో సంచరిస్తున్న భక్తులు



శివాలయం ఘాట్ రోడ్డులో లైట్ల వెలుగులతో వెళుతున్న భక్తుడి కారు

మంచు కురిసే వేళలో.. శ్రీవారి క్షేత్రంలో ప్రకృతి రమణీయ దృశ్యాలు చూపరుల మనస్సులను హత్తుకున్నాయి. హిమ వర్షంలో ఆలయ పరిసరాలు భక్తుల మదిని పులకింపజేశాయి. సోమవారం ఉదయం తొమ్మిది గంటల వరకు క్షేత్రాన్ని మంచు పరదా వీడలేదు. వాహనాలపై క్షేత్రానికి వచ్చిన భక్తులు వాహన లైట్ల వెలుగుల్లోనే రాకపోకలు సాగించారు. హిమ వర్షంలో స్వామి వారి గ్రామోత్సవానికి వెళుతున్న గజలక్ష్మి (ఏనుగు), అశ్వం, గోసంరక్షణ శాలలో గెంతుతున్న లేగ దూడలు, ఖజానా బాతుల సందళ్లు భక్తులకు కనువిందు చేశాయి. పొగ మంచులోనే భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించారు. సెంట్రల్ పార్కింగ్, జంట గోపురాల ప్రాంతాల్లో సందడి చేశారు. కొండపైన ఘాట్ రోడ్లలోని డివైడర్లలో మొక్కలకు నీరు పోసేవారు, పారిశుధ్య కార్మికులు మంచులోనే పనులను సాగించారు. హిమవర్షానికి చెట్లు, ఘాట్ రోడ్లు సైతం తడిచి ముద్దయ్యాయి.

–ద్వారకాతిరుమల

రైతులను నిర్బంధించడం దారుణం



జంగారెడ్డిగూడెం: నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు



బుట్టాయగూడెం: కేఆర్‌పురం జీసీసీ గోడౌన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: అక్రమ కేసులు పెట్టి నోయిడా జైల్లో నిర్బంధించిన రైతులను బేషరతుగా విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆందోళన చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ఎస్‌కేఎం పిలుపునిచ్చింది. జంగారెడ్డిగూడెం బోసుబొమ్మ సెంటర్‌లో ఐఎఫ్‌టీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ పటిష్టమైన భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి 2020లో రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఆ నాడు రైతు ఉద్యమానికి వెనకడుగు వేసిన కేంద్రం మూడు నల్ల చట్టాలను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ డివిజన్ నాయకులు మొల్లేటి శ్రీను, మద్దిపాటి బంగారు రాజు, కంకిపాటి అంజయ్య, ఉప్పాటి దాసు, తానిగడప వెంకటేశ్వరరావు, జోసూరి నాగరాజు, కొత్తూరి నాగు, మద్దిపాటి సత్యనారాయణ, దర్శి పాము, చిన్న చంద్రయ్య, ముప్పిడి సత్తయ్య, దోసూరి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టడం దారుణం

బుట్టాయగూడెం: అక్రమ కేసులు పెట్టి నోయిడా జైల్లో నిర్బంధించిన రైతులను బేషరతుగా విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతులను అక్రమంగా జైల్లో పెట్టడం దారుణమన్నారు. ఈ మేరకు సోమవారం కేఆర్‌పురం గిరిజన కార్పొరేషన్ గోడౌన్ వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రికల్చర్ జాతీయ మార్కెటింగ్ విధానం పేరుతో కొత్త చట్టాలను చేస్తూ ఆ నాటి రైతు వ్యతిరేక చట్టాలను పరోక్షంగా అమలు చేయాలని కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.కిషోర్, మీసాల ఏసు, డి.రాజు, కత్తుల రాజేష్, కుర్సా రాజ్‌కుమార్, కె.చందు, మూలెం నాగేంద్ర, కుర్సం రవి, తదితరులు పాల్గొన్నారు.

రైతులపై అణచివేతను ఆపాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కుక్కునూరు: ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై భాష్ప వాయువు ప్రయోగించి రైతుల పాదయాత్రను అణచివేసే ప్రయత్నం మానుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆ మేరకు వేలేరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతు సంఘం నాయకులు కుక్కునూరు తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు కొన్నె లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కురాకుల బాబురావు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు విడుదల చేయాలి



చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు



జంగారెడ్డిగూడెం: ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలు వెంటనే జమ చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మంగళవారం ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గత నాలుగు రోజుల నుంచి పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెలోకి వెళుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు మరియమ్మ, రాజు, నాగరాజు, వాణి, సుజాత, కుమారి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

జంగారెడ్డిగూడెం: పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బందికి బకాయి జీతాలు, పీఎఫ్, క్యాజువల్ లీవుల సమస్యలపై కార్మికులపై స్పందించకపోవడం దారుణమని ఏఐటీయూసీ జిల్లా సహాయక కార్యదర్శి కూనపాముల విఘ్నేష్ అన్నారు. సోమవారం మెడికల్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాలుగో రోజు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఏజెన్సీ కాంట్రాక్టు యాజమాన్యంతో మాట్లాడకపోవడం, హాస్పిటల్ కార్మికులు పట్ల ప్రభుత్వ వైఖరి ఎలా తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, ఏరియా హాస్పిటల్ గౌరవ అధ్యక్షులు రమణ రాజు, హాస్పిటల్ సిబ్బంది సంజీవరావు, రాజా పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై గళం



కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ఐటీడీఏ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.భూషణం మాట్లాడుతూ నెల రోజులుగా గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలుపుతుంటే కనీసం ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయల సమస్యలను పరిష్కరించాలన్నారు. బన్నే వినోద్, చదల దుర్గాప్రసాద్, కార్తిక్, ప్రవీణ్ కుమార్, హరిప్రసాద్, పీవైఎల్ నాయకులు గోగుల పండు, కెచ్చెల సుధాకర్, చింతల వెంకటేష్, చంద్రు చిట్టిబాబు పాల్గొన్నారు.

ఏజెన్సీ భూ వివాదాలను పరిష్కరించాలి



సమావేశం నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

పోలవరం రూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని భూ వివాదాలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం మండల కమిటీ సమావేశం బొరగం భూచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీలో ఎల్‌టీఆర్ 1/70 చట్ట ప్రకారం గిరిజన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. ఈ భూ వివాదాలను రెవెన్యూ సదస్సులో అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తరాలరాలుగా భూములనే సాగు చేస్తున్న ఆదివాసీ గిరిజనులకు భూములపై హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు తామ బాలరాజు, మడివి చలపతి రావు, సముద్రాల సాయికృష్ణ, పి.కుమారి, టి.శాంతి, గోకూరి పాండవులు, కె.పోసిరత్నం పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

జంగారెడ్డిగూడెం: డీటీ, వీఆర్వోను ఉద్యోగం నుంచి తొలగించి అరెస్టు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్టా కామరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ఆదివాసీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలానికి చెందిన ఆదివాసీలకు 1997లో 64 మందికి పట్టాలు ఇవ్వగా అప్పటి నుంచి ఇప్పటి వరకు భూమి సాగు చేసుకుంటున్నామన్నారు. తాటియాకులగూడెం పంచాయతీ వీఆర్‌ఓ బుల్లాబ్బాయి గిరిజనేతరులకు మ్యూటేషన్ చేశారన్నారు. ఆదివాసీల పేర్లు ఆన్‌లైన్‌లో తొలగించారన్నారు. కేఆర్‌పురం పీఓ షాన్‌మోహన్ కూడా ఆదివాసులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రక్షణ కల్పిస్తూ ఆర్డర్ ఇచ్చారని, హైకోర్టు కూడా 2018లో ఆదివాసీలకు ఆర్డర్ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో జీలుగుమిల్లి మండల కార్యదర్శి తాటి నాగేశ్వరరావు, మండల ఏఎస్పీ ఉపాధ్యక్షుడు, బుట్టాయగూడెం ఏఎస్పీ అధ్యక్షుడు బసవరాజు, పొట్టా కుమారి, కుంజా కుమారి పాల్గొన్నారు.